సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

మంగళవారం ¦ 26 ¦ ఆగస్టు ¦ 2025



కానిస్టేబుల్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. - 8లో



రోడ్డు ప్రమాదం.. రెండు కుటుంబాల్లో విషాదం

కడప కేంద్ర కారాగారం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.6 /23.6

జిల్లాలో సోమవారం 23.6 – 32.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కౌన్సెలింగ్ ప్రశాంతం



వీసీ చేతుల మీదుగా సీట్ అలాట్‌మెంట్ పత్రాన్ని అందుకుంటున్న విద్యార్థి

కడప ఎడ్యుకేషన్ : కడప నగర శివార్లలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించిన తొలి విడత కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఇందులో భాగంగా బీఎఫ్‌ఏ ఫోర్ ఇయర్స్ డిగ్రీ ఫైన్ ఆర్ట్స్ కోర్సులకు కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా 70 శాతం విద్యార్థులు కౌన్సిలింగ్‌కు హాజరై వీసీ డాక్టర్ జి.విశ్వనాథ్ కుమార్ చేతుల మీదుగా విద్యార్థులు సీట్ అలాట్మెంట్ పొందారు.

సెప్టెంబర్ 3న రెండవ దశ కౌన్సెలింగ్

డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్‌యూలో సెప్టెంబర్ 3న బీఎఫ్‌ఏ/బి డిజైన్ కోర్సులకు 2వ దశ కౌన్సెలింగ్ ఉంటుందని వీసీ తెలిపారు. మరింత సమాచారం కోసం www.yrrafuac.in వెబ్సైటును సందర్శించాలని ఆయన తెలిపారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ప్రాధాన్యత



ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడుతున్న ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ఆయా ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం' (పీజీఆర్ఎస్) నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి వచ్చిన 120 మంది ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. ఆయా ఫిర్యాదుల గురించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ బాలస్వామి రెడ్డి, డీటీసీ డీఎస్పీ అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

డీసీసీ బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలి

– ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

కడప అగ్రికల్చర్ : డీసీసీ బ్యాంకు అభివృద్ధికి ఉద్యోగులంతా సమిష్టిగా కృషి చేయాలని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం కడపలోని డీసీసీ బ్యాంకును బ్యాంకు చైర్మన్ సూర్యనారాయణరెడ్డితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన బ్యాంకు స్థితిగతుల గురించి అరా తీశారు. అనంతరం చైర్మన్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా రైతాంగానికి డీసీసీ బ్యాంకు అండగా నిలవాలని అందుకు ఎన్ని కోట్ల రుణాలు కావాలన్నా కడపకు మంజూరు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. డీసీసీ బ్యాంకు సీఈఓ రాజామణి, డీజీఎం ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

28న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

కడప ఎడ్యుకేషన్ : డీఎస్సీ -2025 అభ్యర్థులకు ఈనెల 28వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలన కడప బాలాజీనగర్‌లోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల వేదికగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పరిశీలన నిమిత్తం తమకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

గణపతి ఆకృతిలో విద్యార్థులు



కలసపాడు : వైఎస్సార్ కడప జిల్లాలోని కలసపాడులో సెయింట్ ఆంటోని ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులు గణపతి ఆకృతిలో ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిత్తా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సర్వ మతాలకు అతీతంగా పండుగల సందర్భంలో విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించాలని సూచించారు.

పరిష్కారం అభూతకల్పనే!

- రెవెన్యూలో పేరుకుపోతున్న ఫిర్యాదులు
- గడువులోపు పరిష్కారం వట్టిమాటే!
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ జనం ప్రదక్షిణలు



కలెక్టరేట్ ఆవరణలో అర్జీలు నమోదు చేయించుకుంటున్న బాధితులు

కడప సెవెన్‌రోడ్స్ : కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలు బుట్టదాఖలవుతున్నాయి. పరిష్కారానికి నోచుకోక మూలనపడుతున్నాయి. వస్తున్న అర్జీల్లో సగంపైన రెవెన్యూశాఖకు సంబంధించినవే ఉన్నాయి. ముఖ్యంగా ఆన్‌లైన్, అసైన్‌మెంట్, ఫ్రీ హోల్డ్ భూముల సమస్య, సర్వే, ఆక్రమణలు, రీ సర్వేలో భూమి విస్తీర్ణం తగ్గడం, తప్పుడు రిజిస్ట్రేషన్లు వంటి సమస్యలు అధికంగా వస్తున్నాయి. కలెక్టరేట్‌కు వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించకుండానే అధికారులు నుంచి ఆదేశాలు వెళుతున్నా క్షేత్ర స్థాయిలో అవి అమలు కావడం లేదు. దీంతో వచ్చిన వారే మళ్లీమళ్లీ గ్రీవెన్స్‌సెల్ చుట్టూ తిరుగుతున్నారు. అందులో కొన్ని....

దాల్మియాలో ఉద్యోగం ఇప్పించాలి



2006లో దాల్మియా సిమెంటు కర్మాగారం కోసం 15 ఎకరాల భూమి కోల్పోయాం. అప్పట్లో ఎకరా రూ. 2 లక్షలు ఉన్నప్పటికీ ఉద్యోగం ఇస్తారన్న ఆశతో మా తండ్రి రామ సుబ్బారెడ్డి భూములు అప్పగించారు. మా తండ్రికి ఉద్యోగం ఇవ్వలేదు. నాకు తగిన అర్హత వయస్సు వచ్చాక ఉద్యోగం ఇస్తామని చెప్పినా ఇంతవరకు లేదు. ఫ్యాక్టరీ రెండవ దశ విస్తరణ పై మార్చి 27వ తేదీ నిర్వహించిన పబ్లిక్ హియరింగ్ కార్యక్రమానికి కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి వచ్చినప్పుడు ఆయన దృష్టికి నా సమస్య తీసుకెళ్లాను. కానీ ఇప్పటికీ ఎలాంటి ప్రయోజనం కనిపించలేదు. – ఎర్రబోలు నాగార్జునరెడ్డి, నవాబుపేట, మైలవరం మండలం

పాసు పుస్తకాలు ఇప్పించండి



ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే తర్వాత మా భూములకు 1బీ, పాసుపుస్తకాలు రావడం లేదు. ఇందువల్ల అనేక ప్రభుత్వ సౌకర్యాలు కోల్పోవాల్సి వస్తోంది. ఎన్నిమార్లు అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కరిస్తామని చెప్పడమే తప్ప ఇంతవరకు మాకు న్యాయం జరగడం లేదు. – దొడ్డా సంజీవరాయుడు, మైలవరం మండలం

పంటలు దెబ్బతింటున్నాయి



దాల్మియా ఫ్యాక్టరీ నిర్మాణం వల్ల నవంబరు నుంచి మార్చి వరకు వచ్చే దుమ్ము, ధూళి వల్ల పంటలు దెబ్బతింటున్నాయి. వంకకు అడ్డంగా ఫ్యాక్టరీ గోడ నిర్మించడం వల్ల వర్షాకాలంలో మా పొలాల్లో నీరంతా నిలుస్తోంది. సర్వే నెంబరు 352లోని 9.15 ఎకరాలు ముంపునకు గురవుతోంది. – విజయభాస్కర్‌రెడ్డి, నవాబుపేట, మైలవరం

రహదారి ఆక్రమించి బ్లాస్టింగ్



భూతమాపురం–తలమంచిపట్నం మధ్య రహదారిని ఆక్రమించి దాల్మియా యాజమాన్యం బ్లాస్టింగ్ చేస్తోంది. దీంతో వంకలోకి దారా వచ్చే నీళ్లు ఆగిపోయాయి. ఓపెన్ బ్లాస్టింగ్ వల్ల సమస్యలు వస్తున్నాయి. – శివశంకర్‌రెడ్డి, రైతు, దుగ్గనపల్లి

సాగుభూమి ఆక్రమించారు



సర్వే నెంబరు 138/సీ1 లో 1.84 ఎకరాలు నా పేరిట పట్టా ఉంది. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రోద్బలంతో తహసీల్దార్ వచ్చి కంచె వేసి బోర్డు పాతారు. ఆ స్థలాన్ని అగ్రవర్ణాలకు కట్టబెట్టాలని చూస్తున్నారు. – వెంకటయ్య, టి.కొత్తపల్లె, మైదుకూరు

దివ్యాంగుల పెన్షన్ తొలగింపు దుర్మార్గం

ధర్నాలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం



దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, చిత్రంలో ఆ పార్టీ నేతలు

కడప సెవెన్‌రోడ్స్ : తాము అధికారంలోకి వస్తే పెన్షన్లు పెంచుతామని హామీలు గుప్పించిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక దివ్యాంగుల పెన్షన్లను తొలగించడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి ధ్వజమెత్తారు. పెన్షన్ల తొలగింపు వల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు చరిత్ర హీనుడుగా మిగిలిపోతారన్నారు. వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. వంద శాతం వైకల్యం ఉన్న వారికి కూడా 40 శాతానికి తగ్గిస్తూ పెన్షన్ ఎగ్గొట్టే కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం దిగజారిందని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడిబాషా నవీనాయి కార్యదర్శుల ద్వారా నోటీసులు జారీ చేసి సెప్టెంబరు నెల నుంచి పెన్షన్ తొలగిస్తున్నట్లు తెలుపడం దుర్మార్గమని విమర్శించారు. తొలగించిన పెన్షన్లను తక్షణ మే పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. తాను ప్రత్యేకంగా వెళ్లి కలిసి ఆంటూ చెప్పుకొచ్చిన పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎందుకు మౌనముద్ర దాల్చారని నిలదీశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షఫీ, పాకా సురేష్, అక్బర్ అలీ, అజ్మతుల్లాఖాన్, పార్టీ నాయకులు శ్రీరంజన్‌రెడ్డి, యానాదయ్య, గౌస్‌బాషా, పులి సునీల్‌కుమార్, సిహెచ్ వినోద్‌కుమార్, బూసిపాటి కిశోర్‌కుమార్, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షఫీవుల్లా, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు సుంకేసుల బాదుల్లా, మహిళా విభాగం నాయకులు టీపీ వెంకట సుబ్బమ్మ, పత్తి రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షులు సునీతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రెండు కాళ్లు చచ్చుబడి వీల్‌చైర్‌పై ఒకరు..

రెండు కర్రల సాయంతో కష్టంగా మరొకరు..

కళ్లు కనబడక ఇంకొకరు... మాట వినబడక మరొకరు..

భారాన్ని.. దూరాన్ని లెక్కచేయకుండా కలెక్టరేట్‌కు వచ్చారు. వారు నడుస్తుంటే గుండె బుసలుకొడుతోంది..

అయినా అడుగాపకుండా కలెక్టరేట్ వైపు అడుగులేస్తున్నారు..

'ఏంటయ్యా' అని పలకరిస్తే..

'ఏమైంది పెద్దాయనా' అని మాట కలిపితే..

'మా పింఛన్ తీసేసినారంటయ్యా' అని దీనంగా చెప్పారు.

ఆ క్షణంలో తెలియకుండానే వారి కళ్లల్లోంచి కన్నీళ్లు రాలిపడ్డాయి..

కబోది..ప్రభుత్వమిది

అన్యాయంగా పింఛన్ తొలగించారు



నాకు 45 శాతం వైకల్యం ఉన్నప్పుడు 2010 ఆగస్టు 16వ తేదీ రిమ్స్ వైద్యులు సర్టిఫికెట్ ఇవ్వడంతో పెన్షన్ వచ్చేది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక వెరిఫికేషన్ పేరుతో 40 శాతం కన్నా తక్కువ వైకల్యం ఉందంటూ నోటీసులు జారీ చేసి పింఛన్ తొలగించడం అన్యాయం. – బత్తుల చిన్నవెంకటేశు, కొండూరు బీసీ కాలనీ, అట్లూరు మండలం

పింఛన్ పునరుద్ధరించాలి



నాకు 90 శాతం వైకల్యం ఉన్నట్లు 2007లో సర్టిఫికెట్ ఇచ్చారు. ఇప్పుడు 64 శాతం ఉన్నట్లు పేర్కొనడం చాలా ఆశ్చర్యంగా ఉంది. నా పోలికు బదులుగా వేరే మహిళ ఫోటో జతపరిచి సర్టిఫికెట్ ఇచ్చారు. పాత పెన్షన్ పునరుద్ధరించాలి. – డి.అబ్దుల్, శ్రీనివాసనగర్, ప్రొద్దుటూరు

కూటమి ప్రభుత్వం అన్యాయం చేసింది



నేను రూ. 200 ఉన్నప్పటి నుంచి పెన్షన్ తీసుకుంటున్నాను. అప్పట్లో 90 శాతం వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రీ వెరిఫికేషన్ పేరుతో 70 శాతమే వైకల్యం ఉందంటూ సర్టిఫికెట్‌జారీ చేయడం ఆశ్చర్యంగా ఉంది. ఇదంతా పెన్షన్ మొత్తాన్ని తగ్గించేందుకు చేస్తున్న కార్యక్రమం. – చిన్నగుర్రప్ప, మైలవరం



కూటమితీరుతో దివ్యాంగుల జీవితం తలకిందులైంది. సమస్య వివరించడానికి కలెక్టరేట్‌కు వచ్చిన ఓ దివ్యాంగుడి వ్యథ ఇది.

పింఛన్ పునరుద్ధరించండి సార్..



ఈ చిత్రంలో వీల్‌ఛైర్‌లో కనిపిస్తున్న వ్యక్తి పేరు షరీఫ్. పులివెందుల నియోజకవర్గం వేల్పుల. పదేళ్ల క్రితం పక్షవాతంతో మంచంలో పడ్డాడు. రెండు కాళ్లు, చేతులు పనిచేయక పోవడంతో దివ్యాంగుల పెన్షన్ వస్తుంది. పెన్షన్‌తో పూట గడవడం ఇబ్బందిగా మారడంతో భార్య ఫక్ర్ న్నీసా వ్యవసాయం కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ముగ్గురు కుమార్తెలు కలిగిన వీరికి కూటమి ప్రభుత్వం పిడుగులాంటి వార్త చెప్పింది. రీవెరిఫికేషన్ పేరుతో సదరం సర్టిఫికెట్ తెచ్చుకోమని పెన్షన్‌దారుల జాబితాలో టిక్ పెట్టి షరీఫ్ పెన్షన్ రద్దు చేశారు. రెండో సారి నెల ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. ప్రయాస పడి అక్కడ కూడా రీ వెరిఫికేషన్ కు హాజరయ్యారు. చివరికి ఈ నెలలో మీకు పెన్షన్ రాదూ అని చెప్పడంతో షరీఫ్ కుటుంబ సభ్యులు బాధ్య, పిల్లలతో కలెక్టరేట్‌కు వచ్చారు. డీఆర్వో విశ్వేశ్వర నాయుడుకు తాము పడిన బాధలు తెలియజేశారు. ఎన్నో వ్యయ ప్రయాసలు పడి వేల్పుల నుంచి ఆటోలో 1500 రూపాయలు బాడుగా చెల్లించుకొని వచ్చామని.. దయ చూపి తన భర్తకు దివ్యాంగుల పెన్షన్ పునరుద్ధరణ చేయండి సార్ అంటూ తన చిన్నారులకు చూపిస్తూ షరీఫ్ భార్య ఫక్రున్నీసా కంటతడి పెట్టింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

కడప టీడీపీలో అసమ్మతి మంటలు!

- టీడీపీ పార్లమెంటు స్థాయి సమావేశంలో ఎగిరిపడ్డ
- 14 నెలలు అవుతున్నా నామినేటెడ్ పోస్టుల భర్తీ ఏదీ?
- ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే పుత్తా, జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్
- జిల్లా అధ్యక్షుడు వాసును మార్చాల్సిందిగా ఫిర్యాదులు
- అధ్యక్ష రేసులో పలువురు సీనియర్లు



సాక్షి ప్రతినిధి, కడప : కడప టీడీపీలో అసమ్మతి మంటలు చెలరేగాయి. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడిని మార్పు చేయాల్సిందిగా త్రిసభ్య కమిటీకి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సోమవారం హరితా హోటల్ ప్రాంగణంలో త్రిసభ్య కమిటీ సమావేశం అందుకు వేదికైంది. ప్రభుత్వంలోకి వచ్చి 14నెలలు పూర్తయినా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయలేదని, కార్యకర్తలు న్యాయం చేయలేకున్నామని ఆవేదన వ్యక్తమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి, ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం త్రిసభ్య కమిటీ టీడీపీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర మాట్లాడుతూ 20 ఏళ్ల తర్వాత కడపలో ఏడు స్థానాలను కైవసం చేసుకున్నామని,సమీకరణలో జరిగిన పోస్టింగ్ కారణంగా బద్వేల్ పోగొట్టుకోవాల్సి వచ్చిందని వెల్లడించారు. సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మెల్యే సీట్లు లభించినా కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులు దక్కలేదని వివరించారు. వైఎస్సార్ సీపీ పాలనలో కమలాపురం నియోజకవర్గంలో 25 మందికి పదవులను ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఎలాంటి పదవులు రాలేదని వివరించారు. జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు పదవులు లేకపోవడంతో తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ తమపై దుష్ప్రచారం చేస్తోందని.. ఇది అంతర్గత సమావేశం పార్టీకి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవహరించాలని చెప్పుకొచ్చారు.

జిల్లా అధ్యక్షుడిపై ఫిర్యాదుల పరంపర...

త్రిసభ్య కమిటీ దృష్టికి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డిపై ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. జిల్లా అధ్యక్షుడిని మార్చాలంటూ అప్పుడే పార్టీకి ప్రయోజనం ఉంటుందంటూ పలువురు వివరించినట్లు సమాచారం. ఆమేరకు కొందరు పుత్తా నరసింహారెడ్డికి జిల్లా అధ్యక్షపదవి అప్పగించాల్సిందిగా సూచించగా, పార్టీని నమ్ముకొని ఉన్న గోవర్ధన్‌రెడ్డికి కట్టబెట్టాలని మరికొందరు అభ్యర్థించినట్లు సమాచారం. తద్వారా పార్టీ కార్యకర్తలకు మంచి మెసేజ్ ఇచ్చినట్లు కూడా అవుతుందని వివరించినట్లు తెలుస్తోంది. మరికొంత మంది హరిప్రసాద్ పేరు సూచించి కాపు సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు అవుతుందని వివరించినట్లు సమాచారం. అన్ని విషయాలు ఆలకించిన దృష్టికి తీసుకెళ్తామని త్రిసభ్య కమిటీ సభ్యులు సూచించినట్లు తెలుస్తోంది.

మట్టి విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : గణేష్ ఉత్సవాల్లో మట్టి వినాయక ప్రతిమలను వినియోగించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గణేష్ ఉత్సవాల్లో పర్యావరణ సహిత మట్టి విగ్రహాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల్లో అవగాహన పెంచేలా.. రాష్ట్ర పర్యావరణ నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్‌లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు కలెక్టర్‌కు మట్టి వినాయకుడి ప్రతిమను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మట్టివిగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన పెంచేలా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ) విగ్రహాలను వాడటం వల్ల చెరువులు, నదులు, ఇతర జల వనరులు కాలుష్యం అవుతున్నాయన్నారు. జిల్లా పర్యావరణ ఇంజనీర్ సుధా కురువ, జేసీ అదితి సింగ్, ఓఎస్డీ మత్యరావు, పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా. శారద, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

క్లుప్తంగా

మహిళ ఆత్మహత్య

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం ముద్దనూరు రోడ్డు సమీపంలో ఉన్న చెన్నారెడ్డి కాలనీలో గోగుల సురేఖ అనే మహిళ కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకుంది. సురేఖ భర్త చిన్నబ్రహ్మం కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొన్నేళ్లుగా సురేఖ కడుపు నొప్పితో బాధపడుతుండేది. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సురేఖ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కడప అర్బన్ : గిరిజనులు బాల్య వివాహాలు, చిన్న వయసులోనే గర్భ ధారణ తదితర అంశాలపై అవగాహన కలిగి బాల్య వివాహాలను అరికట్టాలని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాదులు మనోహర్, రవితేజ పేర్కొన్నారు. సోమవారం కడప నగరం సరోజిని ఎస్టీ కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థానాలకు చేర్చాలన్నారు. విద్యా హక్కు చట్టం , ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్స్ ఎన్జీఓ కోఆర్డినేటర్ రవీంద్రనాథ్, సీఎస్‌డబ్ల్యుఓ నిర్మల, పారా లీగల్ వలంటీర్ దశరథరామిరెడ్డి, గిరిజనులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగాసన ఎంపికలు



ప్రశంసా పత్రాలు అందుకున్న వారితో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, తదితరులు

వేంపల్లి : స్థానిక శ్లోక ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో రాష్ట్రస్థాయి యోగాసన ఎంపికలు నిర్వహించినట్లు జిల్లా ప్రెసిడెంట్ అనిల్, సెక్రటరీ తేజ పేర్కొన్నారు. సోమవారం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో 70 మంది ట్రిపుల్ ఐటీ, కడప, పులివెందుల, తొండూరు తదితర ప్రాంతాల క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. విజేతలు సెప్టెంబర్ నెల 6, 7 తేదీలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డాక్టర్ కుమారస్వామి గుప్తా, ట్రిపుల్ ఐటీ క్యాంపస్ నిర్వహణ కోఆర్డినేటర్ పవన్ కుమార్, శ్లోక స్కూల్ కరస్పాండెంట్ నవనీశ్వర్ రెడ్డి, ప్రిన్సిపల్ సురేంద్ర విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ అబ్జర్వర్ మనోహర్ రెడ్డి, టెక్నికల్ రిఫ్రికేశవ తదితరులు పాల్గొన్నారు.

ఏమిటీ అన్యాయం?



వందశాతం అంధత్వం ఉన్నట్లు 2011లో ఇచ్చిన ధ్రువపత్రం



20 శాతమే అంధత్వం ఉన్నట్లు తాజాగా ఇచ్చిన డాక్టర్ సర్టిఫికెట్



పింఛన్ నిలిపివేస్తూ అధికారులు ఇచ్చిన నోటీసు

- రెండు కళ్లులేని పుట్టు అంధురాలికి పెన్షన్ నిలిపివేత
- ఐదు నెలలక్రితం వైద్య పరీక్షలు.. తాజాగా నోటీసులు
- దివ్యాంగులపై కక్షగట్టిన సర్కార్ దురాగతానికి ఇదో తార్కాణం

మైలవరం : ఆమె జన్మతః అంధురాలు. రెండు కళ్లు బొత్తిగా కనిపించవు. బాల్యం నుంచి వికలాంగుల పెన్షన్ అందుకుంటున్న ఆమెకు ప్రస్తుతం 49 సంవత్సరాల వయసు. పుట్టుకతోనే అంధురాలు కావడంతో ఆమెకు వివాహం కాలేదు. నేటికి ఒంటరి మహిళగానే బతుకు బండిని నెట్టుకు వస్తూ జీవన పోరాటం చేస్తోంది. ఆమె పెన్షన్ అందుకుంటున్న మూడు దశాబ్దాల కాలంలో ఎన్నో ప్రభుత్వాలు మారాయి.. ఏ ఒక్కరూ ఆమె పెన్షన్‌పై కత్తి కట్టలేదు. అలాంటిది చంద్రబాబు సర్కార్ ఏమంటూ వచ్చిందో గాని పుట్టు అంధురాలైన ఆమె పెన్షన్‌ను ఉన్నపళంగా నిలిపి వేసింది. వందశాతం అంధత్వం ఉన్న ఆ అంధురాలి పింఛన్ నిలిపివేయటానికి అధికారులకు చేతులు ఎలా వచ్చాయో అని ప్రజల నుంచి ప్రశ్నల వర్షం కురుస్తూనే ఉంది.

పాపం దస్తగిరమ్మ..!

మైలవరం మండలం చిన్న వెంతుర్ల గ్రామానికి చెందిన దస్తగిరమ్మకు పుట్టుకతోనే చూపు లేదు. వంద



పుట్టుకతోనే అంధురాలైన దస్తగిరమ్మ

శాతం అంధత్వం ఉన్నట్లు ఎప్పుడో వైద్యులు ధ్రువీకరించారు. ఆ తర్వాత పలు మార్లు జరిపిన వైద్యపరీక్షల్లో కూడా వంద శాతం అంధత్వం ఉన్నట్లే ధ్రువీకరణ పత్రాలు ఇస్తూ వచ్చారు. గత 30 సంవత్సరాలుగా ఆమె పెన్షన్ అందుకుంటూనే ఉంది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత బోగస్ పెన్షన్‌ల ఏరివేతలో భాగంగా దివ్యాంగులందరికి తాజాగా వైద్య పరీక్షలు చేయించారు. దస్తగిరమ్మకు ఈ ఏడాది మార్చి నెలలో వైద్య పరీక్షలు చేసి పంపించారు. అంతా సవ్యంగా జరిగిందన్న తరుణంలో నాలుగు రోజుల క్రితం దస్తగిరమ్మకు పెన్షన్ నిలిపి వేస్తున్నట్లు నోటీసులు అందాయి. విషయం ఏమిటని ఆరాతీస్తే తాజాగా వైద్య పరీక్షలు నిర్వహించిన ఆ వైద్య మహానుభావుడు ఆమెకు కేవలం 20 శాతం మాత్రమే అంధత్వం ఉన్నట్లు ధ్రువీకరించాడట. ఆ సర్టిఫికెట్ ఆధారంగా రెండు కళ్లులేని ఆమెకు సంబంధిత అధికారులు సైతం కళ్లు మూసుకుని పెన్షన్ పెరికేశారు.

ఆమె గోడు ఎవరికి చెప్పుకోవాలి?

పుట్టుకతో అంధురాలైన దస్తగిరమ్మకు బాల్యంలోనే తల్లి చనిపోయింది. వృద్ధుడైన తండ్రి దస్తగిరి చెంతనే ఆమె జీవనం సాగిస్తోంది. అవివాహితురాలైన ఆమెకు పింఛన్ ఒక్కటే ఆధారం. పింఛన్ వస్తుండటంతో ఆమెకు ఏ ప్రభుత్వ పథకం వర్తించదు. రెండు కన్నులు కనిపించకపోవడంతో పొలం పనులకు సైతం ఆమె వెళ్లలేని పరిస్థితి తండ్రికి భారం కాకుండా ఇంట్లోనే ఉంటూ తన పని తానే చేసుకుంటుంది. అంతటి దయనీయ జీవితం గడుపుతున్న ఆమెకు పింఛన్ నిలిపివేసి ప్రభుత్వం సాధించింది ఏమిటి. వైద్యులు తిరిగి పరీక్షలు నిర్వహించి ఆమె పింఛన్ పునరుద్ధరించాలంటే కనీసం రెండు మూడు నెలల సమయం తర్వాత దరఖాస్తు చేసుకుంటే తిరిగి పింఛన్ అర్హత ఉంటే పింఛన్ పునరుద్ధరిస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ తతంగం జరిగే సరికి రెండు మూడు నెలల కాలం గడిచిపోతుంది. ఆ మధ్యలో ఆమెకు పింఛన్ ఎవరిస్తారు? ఒకటో తేదీన పరిస్థితి ఏమిటి. ఆమెకు కాదు వైద్యులకే అంధత్వం పుట్టుకతో వచ్చినట్లు ఉంది. ఆమెకు చంద్రబాబు నాయుడు సర్కార్ పుణ్యమా అంటూ పింఛన్ తొలగించడం ముక్కున వేలు వేసుకునేలా చేసింది. చివరకు అధికారులు సైతం నివ్వెర పోతున్నారు. సరిగ్గా రెండు నెలల క్రితం వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యుడికి ఈమె అంధత్వం కనిపించలేదా. లేదా పరీక్షలు చేయకుండానే ఏసీ రూముల్లో కూర్చొని గుడ్డిగా సర్టిఫికెట్ మంజూరు చేశారా అనేది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. ఏది ఏమైనా దివ్యాంగుల జీవితంతో చెలగాటమాడటం ఎంత వరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పింఛన్ల తొలగింపుపై దివ్యాంగుల ధర్నా



ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

పులివెందుల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లు తొలగించినందుకు నిరసనగా దివ్యాంగుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పులివెందుల ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. అన్యాయంగా తొలగించిన అర్హులైన దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని కోరారు. కాళ్లు, చేతులు, కళ్లు కోల్పోయి దయనీయమైన పరిస్థితుల్లో జీవిస్తున్న దివ్యాంగుల పొట్టగొట్టి, సూపర్ సిక్స్ అంటూ ఇతర వర్గాలకు సొమ్ములను ధారపోయడం ఎంత వరకు సమంజసమన్నారు. తమ ఉసురు తప్పక తగులుతుందన్నారు. తొలగించిన పింఛన్లను పునరుద్ధరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘాల ఐక్యవేదిక కార్యవర్గ సభ్యులు శీలం సునీల్ కుమార్, రామకృష్ణ, చాగలేటి శివప్రసాద్, చాగలేటి ఉమాదేవి, రామసుబ్బయ్య, రామాంజనేయులు, ఈశ్వరయ్య, రవి, అశ్విని, స్వర్ణలత, తులసి, రాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ తల్లిని తిట్టినా ఎమ్మెల్యేపై చర్యల్లేవు

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : జూనియర్ ఎన్టీఆర్ తల్లిని తిట్టిన అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్‌పై ప్రభుత్వం ఇంత వరకు తగిన చర్యలు తీసుకోలేదని ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆక్షేపించారు. ఇటీవల రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు మహిళలపై దాడులకు పాల్పడుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సోమవారం తన స్వగృహంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి లేకపోయినా భరించగలిగామని, స్త్రీలకు స్వేచ్ఛ, గౌరవం, భద్రత లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. పాలకులే కీచకులయ్యారని విమర్శించారు. గతంలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని విమర్శించినప్పుడు తాను ఖండించానన్నారు. తల్లి ఎవరికైనా తల్లేనన్నారు. ఎన్టీఆర్ తల్లి పాదాలను ఎమ్మెల్యే కన్నీటితో కడిగి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు ధర్నా చేయడానికి, ప్రెస్‌మీట్ పెట్టడానికి కూడా ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదన్నారు. కేవలం జూనియర్ ఎన్టీఆర్‌పై అసూయతోనే చంద్రబాబు, లోకేష్ ఇలా చేస్తున్నారని, జూనియర్ ఎన్టీఆరే ఎన్టీఆర్‌కు అసలైన వారసుడన్నారు.

ఎమ్మెల్యేలపై ఎందుకు చర్యలు తీసుకోలేదు

రాష్ట్ర వ్యాప్తంగా అనేక చోట్ల టీడీపీ ఎమ్మెల్యేలు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినా, మాట్లాడినా, ఉద్యోగులపై దాడి చేసినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని రాచమల్లు నిలదీశారు. ఇప్పటికైనా స్థాయిని చూడకుండా తప్పు చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు తమ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించకుండా అధికార పార్టీకి గుమస్తాలుగా, బానిసలుగా పని చేస్తుండటం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, కౌన్సిలర్లు ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, సత్యం, రాగుల శాంతి, లావణ్య, నాయకుడు బీఎన్‌ఆర్ పాల్గొన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ జె. శ్రీనివాసరావు



రికార్డులను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ జె.శ్రీనివాస్

దువ్వూరు/ఖాజీపేట/జమ్మలమడుగు : ఎరువుల దుకాణాల యజమానులు యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ జె.శ్రీనివాసరావు హెచ్చరించారు. దువ్వూరు, ఖాజీపేట మండలాల్లోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. గోడౌన్లలో స్టాక్‌ను తనిఖీ చేశారు. దువ్వూరులోని కాశినాయన ట్రేడర్స్, వెంకటేశ్వర ట్రేడర్స్, జువారి జై కిసాన్ ట్రేడర్స్‌లలో, చింతకుంట, కానగూడూరు, గుడిపాడుల్లోని రైతు సేవా కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. జిల్లాలో 3,350 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉందని, మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో 20 మెట్రిక్ టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 72 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శివన్న, మైదుకూరు వ్యవసాయశాఖ ఏడీఏ కృష్ణమూర్తి, మండల వ్యవసాయాధికారి అమరనాథ రెడ్డి, ఏఎస్ఐ భూషణం, వ్యవసాయశాఖ, పోలీసు సిబ్బందిఖాజీపేట ఏఓలు సుమంత్ కుమార్‌రెడ్డి, నాగార్జున, జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు, ఏడీ అనిత, ఏఓ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

విచారణకు హాజరైన మాజీ ఎమ్మెల్యే



పోలీసు స్టేషన్‌కు వస్తున్న మాజీ ఎమ్మెల్యే

జమ్మలమడుగు : మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్ రెడ్డి సోమవారం పోలీసుల విచారణకు హాజరయ్యారు. సోమవారం ఆయన పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. ఈనెల 12వ తేదీన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి కడపకు తీసుకెళుతున్న సమయంలో సుధీర్‌రెడ్డి అడ్డు తగిలినందుకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యేను 16వతేదీన హాజరు కావాలంటూ నోటీసులు ఇచ్చారు. అయితే అనారోగ్యం కారణంగా రాలేనంటూ న్యాయవాదుల చేత నోటీసులు పంపించి 20వ తేదీ హాజరవుతానని తెలిపారు. 20వతేదీ పోలీసు స్టేషన్‌కు వెళ్లగా ఉన్నతాధికారులు ఎవ్వరూ లేకపోవడంతో తిరిగి 25వ తేదీ హాజరు కావాలంటూ నోటీసులు ఇచ్చారు. ఈమేరకు ఆయన సోమవారం విచారణకు హాజరు కాగా సీఐ విశ్వనాథ్ విచారించి స్టేషన్ బెయిల్‌తో సుధీర్‌రెడ్డిని పంపించారు.


ఎస్ఐపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు(రిపైజ్డ్)



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బాధితురాలు సులోచన

కడప రూరల్ : పులివెందుల ఎస్ఐ నారాయణపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు పులివెందులలోని ఇస్లాం పురం వీధికి చెందిన సులోచన తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒక నెల క్రితం ఎవరో ఏదో చెప్పారని ఎస్ఐ నారాయణతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు తన ఇంటికి వచ్చారని అన్నారు. తనకు సంబంధం లేని అంశాలను అడగడంతో తెలియదని చెప్పానని తెలిపారు. ఆ ఎస్ఐ తన పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు కొట్టారని పేర్కొన్నారు. ఆయన బీరువా బీగాలు అడిగాడని, లేవని చెప్పడంతో బీరువాను పగుల గొట్టి అందులో ఉన్న రూ 1.39 లక్షలు తీసుకెళ్లారని ఆరోపించారు. మా అమ్మకు ఆరోగ్యం బాగా లేనందున, బంగారం కుదువ పెట్టి డబ్బు తెచ్చామన్నారు. అమ్మ వైద్యం కోసం తెచ్చిన డబ్బును ఆ ఎస్ఐ తీసుకెళ్లారని ఆరోపించారు. తాను ఏదైనా తప్పు చేసి ఉంటే విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని అలా కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై సోమవారం కడపలో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తనకు ఆ ఎస్ఐ నుంచి రక్షణ కల్పించడంతో పాటు న్యాయం చేయాలని వేడుకున్నారు. జై హిందుస్థాన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ బాధితురాలికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన



అధికారులకు సూచనలు చేస్తున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల నియామక ప్రక్రియలో భాగంగా, అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పరిశీలనకు మొత్తం 352 మంది అభ్యర్థులకు గాను 190 మంది సివిల్, ఏపీఎస్పీ అభ్యర్థులు హాజరయ్యారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామన్నారు. సరైన ధ్రువీకరణ పత్రాలు ఉన్న అభ్యర్థులకే ఉద్యోగం వస్తుందని, తప్పుడు పత్రాలు ఉన్నట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్.పి (ఎ.ఆర్) బి.రమణయ్య, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ఐలు వీరేష్, టైటస్, శివరాముడు, ఏఓ కె.వెంకటరమణ, సూపరింటెండెంట్‌లు ఎస్.గౌస్ పీర్, సురేష్ బాబు, సీనియర్ అసిస్టెంట్ బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భర్త, బంధువులు వేధిస్తున్నారని ఫిర్యాదు

కడప అర్బన్ : కడప నగరంలోని మరియాపురానికి చెందిన వసంతకు, కలికిరికి చెందిన ప్రవీణ్‌కుమార్‌కు 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. వసంత, తన భర్తతోపాటు, అత్త, బంధువులు వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా సీఐ టి.రెడ్డెప్ప తెలిపారు.

రిమ్స్ మార్చురీలో రెండు మృతదేహాలు





కడప అర్బన్ : కడప రిమ్స్ మార్చురీలో రెండు గుర్తు తెలియని మృతదేహాలున్నాయి. ఎవరైనా సరైన ఆధారాలతో తమను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్



ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : సమస్యల పరిష్కారం కోసం వివిధ వర్గాల వారు ధర్నాలు చేపట్టడంతో సోమవారం కలెక్టరేట్ దద్దరిల్లిపోయింది. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఎమ్మార్పీఎస్ (దండు వీరయ్య మాదిగ) నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆ సంఘం నాయకులు బీసీ గంగులు, ఆంజనేయులు, నాగభూషణం మాట్లాడుతూ దివ్యాంగుల జనాభా దామాషా మేరకు ఆరుశాతం పైబడి ఉద్యోగాల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సహదేవుడు, నరసింహులు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు న్యాయం చేయాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఈపీఎస్-95 పెన్షనర్ల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ ఈపీఎస్-95 పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9 వేలు డీఏతో కలిపి చెల్లించాలన్నారు. 8వ పీఆర్సీ కమిషనర్‌ను నియమించి మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. ఎన్‌పీఎస్, యూపీఎస్, సీపీఎస్‌లను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించి ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 20 వేల కోట్ల బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఎ.రఘునాథ్‌రెడ్డితోపాటు ఇతర నాయకులు, పెన్షనర్లు పాల్గొన్నారు.

నారా లోకేష్ రాజీనామా చేయాలి

విద్యారంగ సమస్యలు పరిష్కరించలేని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్ రవి డిమాండ్ చేశారు. సోమవారం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే 14 నెలలు గడుస్తున్నా కనీసం విద్యార్థులకు ఇచ్చిన హామీలు కానీ, విద్యారంగ సమస్యలు కానీ పరిష్కరించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అజయ్, రాజశేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మోహన్, జెర్మియా, చారి, నగర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, అఖిలేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న పెన్షనర్లు



ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

రోడ్డు ప్రమాదం.. రెండు కుటుంబాల్లో విషాదం

- స్కూటీని ఢీకొన్న ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు
- ఇద్దరు యువకుల దుర్మరణం




ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు





నవీన్‌కుమార్ (ఫైల్), నవీన్ కుమార్ మృతదేహం





అంచెల చరణ్ (ఫైల్), చరణ్ మృతదేహం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని కేంద్ర కారాగారం సమీపంలో ఈనెల 24వ తేదీన రాత్రి సమయంలో కడప వైపు నుంచి స్కూటీలో వెళుతున్న ఇద్దరు యువకులను, తిరుపతి వైపు నుంచి వచ్చిన ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో మోదుగుల నవీన్‌కుమార్ (22), అతని స్నేహితుడు అంచల చరణ్ (20)లు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ సంఘటన రెండు కుటుంబాల్లోనూ, స్నేహితులను విషాదంలో నింపింది. మరణించిన ఇద్దరిలో నవీన్‌కుమార్ హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు పూర్తి చేసి ఉద్యోగం చేస్తున్నాడు. తండ్రి శ్రీహరి, తల్లి సుజితలు. శ్రీహరి ఐరన్ మార్ట్‌ల వద్ద ఆటో బాడుగకు తిప్పుతూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి నవీన్‌కుమార్ కంటే ముందు ఓ కుమారుడు ఉండేవాడు. ఆ పిల్లాడు చిన్న వయసులోనే అనారోగ్యంతో మృతి చెందాడు. వీరు శంకరాపురంలో నివాసం ఉంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన సెంట్రింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్న రవి, విజయల కుమారుడు అంచల చరణ్ కొత్త బస్టాండ్ సమీపంలో ఓ దుకాణంలో మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చరణ్‌కు డిగ్రీ చదువుతున్న షాలిని అనే చెల్లెలు ఉంది. రెండు కుటుంబాల్లోనూ ఒక్కొక్కరే కుమారులు. వీరిద్దరు ఈనెల 24వ తేదీన రాత్రి సైనిక్ నగర్‌లో ఉంటున్న నవీన్‌కుమార్ బంధువుల ఇంటికి పనిమీద బయలుదేరారు. కడప కేంద్ర కారాగారం సమీపంలోకి వెళ్లగానే ఆర్టీసీ ఎలక్ట్రికల్ బస్సు ఢీకొనడంతో స్కూటీలో నుంచి ఎగిరిపడి ముందు భాగాన చరణ్ తల తగలగానే తీవ్రంగా గాయపడ్డాడు. నవీన్‌కుమార్ కూడా తీవ్రంగా గాయపడి ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. అదే మార్గంలో వెళుతున్న నవీన్‌కుమార్ తండ్రి శ్రీహరి స్నేహితుడు ప్రమాదం గురించి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో ఇద్దరి తల్లిదండ్రులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మరణించడంతో తీవ్రంగా విలపించారు. తల్లిదండ్రులకు ఈ దుర్ఘటన కడుపుకోతనే మిగిల్చింది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన తరువాత మృతదేహాలను వెంటనే రిమ్స్‌కు తరలించారు. సోమవారం మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప ట్రాఫిక్ సీఐ జావేద్ తెలిపారు.